కంకర వేసి వదిలేశారు!

- 4 నెలలైనా పత్తాలేని కాంట్రాక్టర్
- నడవడానికి నరకయాతన పడుతున్న కాలనీవాసులు
- గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాం కాలనీలోని పరిస్థితి ఇదీ


కంకర వేసి వదిలేసిన రోడ్డు

ఎల్‌బీనగర్: కొత్త రోడ్లు వేస్తామని ఉన్న రోడ్లు తవ్వేశారు.. నాలుగు నెలలైనా కొత్త రోడ్ల ఊసే లేదు.. దీంతో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లపై వాహనలే కాదు.. కనీసం నడక కూడా నరక యాతనగా మారింది. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కోదండరాం కాలనీలో రామాలయ వీధిలోని రహదారి పరిస్థితి ఇదీ. కాలనీలోని సీసీ రోడ్లకు అక్కడక్కడ గుంతలు పడటంతో కొత్తగా రోడ్లు వేయాలని అధికారులు నిర్ణయించారు. రూ.35 లక్షల అంచనాలు వేసి టెండర్ ప్రక్రియ పూర్తి చేసి వెంటనే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు

- సదరు కాంట్రాక్టర్ నాలుగు నెలల క్రితం ఉన్న రోడ్లు మొత్తం తవ్వి కంకర వేసి పత్తా లేకుండా పోయాడు.
- ఈ వీధిలోనే ఉన్న రామాలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేస్తుంటారు. వచ్చే నెలలో నిర్వహించే రాములోరి కల్యాణానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. కంకర తేలిన ఈ రోడ్డుపై భక్తులు ఆలయానికి రావాలంటే నరకయాతన తప్పదు.
- కంకర తేలి ఉండటంతో రహదారిపై వెళ్లాలంటే వాహదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డుపై వాహనాలు వెళ్తే టైర్లకు రాళ్లు గుచ్చుకొని పంచర్లు అవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- శ్రీరాం నవమి ఉత్సవాల లోపు రామాలయ వీధిలోని రోడ్డు పనులు కాకపోతే మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు.
- అయితే, తనకు రావాల్సిన పాత బిల్లులు చెల్లించకపోవడంతోనే కాంట్రాక్టర్ ఈ రోడ్డు పనులను నిలిపివేసినట్లు తెలుస్తోంది.

పది రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు

రోడ్డు పనులు నిలిచిపోయిన మాట వాస్తవమే. పాత బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. దీనికి తోడు క్రషర్ మిషన్ల సమ్మె కారణంగా మెటీరియల్ రాకపోవడం తలనొప్పిగా మారింది. అధికారులతో మాట్లాడి పదిరోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– బద్దం ప్రేమమహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్

అద్భుతంగా థీమ్ పార్కు నిర్మాణం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


థీమ్‌పార్కు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: దాదాపు ఎకరం స్థలంతో అద్భుతమైన థీమ్ పార్కును బీఎన్‌రెడ్డి నగర్‌లో నిర్మిస్తున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డిన్ ఫేజ్–3లో రూ.1.25 కోట్లతో నిర్మిస్తున్న థీమ్‌పార్కు పనులను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, థీమ్ పార్కులో అద్భుతమైన బుద్ధుడి విగ్రహం, యోగా షెడ్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు, వాకింగ్ ట్రాక్, టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను త్వరిగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. నియోజక అభివృద్ధే లక్ష్యమని స్పష్టంచేశారు. కార్యక్రమంలో నాయకులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనంతుల రాజిరెడ్డి, రవి, రాఘవేందర్‌రావు, రాంబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలోని అవినీతిని ఎదుర్కోవాలి

టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ గౌడ్


మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

దిల్‌సుఖ్‌నగర్: న్యాయశాస్త్ర విద్యార్థి రాజ్యాంగాన్ని గౌరవించడంతో పాటు సమాజంలోని అసమానతలను అవినీతిని న్యాయమార్గంలో ఎదుర్కోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ గౌడ్ సూచించారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్రా లేఅవుట్‌లోని మహాత్మా గాంధీ న్యాయ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ, న్యాయశాస్త్ర అభ్యాసంలో విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించినప్పుడే తమ వృత్తిలో రాణించగలుగుతారన్నారు. ప్రస్తుత కాలంలో న్యాయశాస్త్ర విద్యార్థులకు వివిధ రంగాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఉస్మానియా న్యాయ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జీబీ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు పట్టుదలతో న్యాయశాస్త్రాన్ని అభ్యాసం చేయాలన్నారు. కళాశాలలో ప్రతి అంశం గురించి క్షుణ్ణంగా నేర్చుకోవాలని సూచించారు. జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా ఎంపికై న కళాశాల పూర్వ విద్యార్థి హరీష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల సెక్రటరీ గంగుల గోవర్ధన్ రెడ్డి , ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్‌వీ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘భారతి అల్ట్రాఫాస్ట్’తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం


తాపీ మేస్త్రీలకు ఉచిత ప్రమాద బీమా బాండ్లను పంపిణీ చేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

మన్సూరాబాద్: సిమెంట్ రంగంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ ఎదుగుతోందని సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ నితీష్‌యాదవ్ అన్నారు. నాగార్జున స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ డీలర్‌షిప్‌లో తాపీ మేస్త్రీలతో గురువారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోల్చితే భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌లో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందన్నారు. భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌తో తెలంగాణలో విడుదల చేసినట్లు వివరించారు.భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి సరైన అని అన్నారు. భారతి అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచితంగా సాంకేతిక సహాయం అందిస్తున్నామని, సైట్ వద్దకే సంస్థ ఇంజినీర్లు విచ్చేసి సహకారాలు అందిస్తారని స్పష్టం చేశారు. అనంతరం 40 మంది తాపీ మేస్త్రీకు లక్ష రూపాయల ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో డీలర్ అనిల్‌రెడ్డి, డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ రామకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్ బద్రీ తదితరులు పాల్గొన్నారు.

వాహనంతో ఉడాయించిన డ్రైవర్

చంచల్‌గూడ: డ్రైవర్‌గా విధుల్లో చేరి ఏకంగా వాహనానికి ఎసరు పెట్టాడు ఓ ప్రబుద్ధుడు. గురువారం మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడ బస్తీలో కూల్ డ్రింక్స్ వ్యాపారం నిర్వహిస్తున్న జె.నిరంజన్‌యాదవ్ (50) వ్యాపార నిమిత్తం కర్ణాటకలోని గుల్బర్గాలో ఓ ఏజెన్సీ నుంచి రూ. 5 లక్షల విలువైన కూల్ డ్రింక్స్ కొనుగోలు చేశాడు. హైదరాబాద్‌కు దిగుమతి చేసుకునే క్రమంలో తన డ్రైవర్ రాజాసింగ్‌కు తన డీసీఎం వాహనం ఇచ్చి కర్ణాటకకు పంపాడు. కూల్ డ్రింక్స్ లోడ్ చేసుకున్న డ్రైవర్ దుర్బుద్ధితో యాజమానికి ఫోన్ చేసి తనకు రూ. 40 వేలు ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయాలని, లేకుంటే కూల్ డ్రింక్స్‌తో పాటు డీసీఎంను స్క్రాప్‌లో విక్రయిస్తానని బెదిరించి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. మోసపోయానని గ్రహించిన బాధితుడు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కాంగ్రెస్‌లో చేరిక

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ నియోజక వర్గానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు గురువారం రాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరారు. లింగోజిగూడ డివిజన్‌కు చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కోటగిరి శ్రీనివాస్‌గౌడ్, హనుమాన్ ఆలయ మాజీ డైరెక్టర్ చేగోని అశోక్‌గౌడ్, సీనియర్ నాయకుడు శంకర్‌గౌడ్‌లు తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, ఏఐసీసీ నాయకులు మధుయాష్కీగౌడ్‌ల సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.

నవ తెలంగాణ నిర్మాణానికి సహకరిస్తాం


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వెంకటగాంధీ

చైతన్యపురి: నవ తెలంగాణ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి చేసే కృషికి తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలంగాణ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వై. వెంకటగాంధీ అన్నారు. కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


శివలింగానికి అభిషేకం చేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, వంగా మధుసూదన్‌రెడ్డి

హస్తినాపురం: ప్రతి ఒక్కరూ ధర్మాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని.. ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్‌లోని హరిహరక్షేత్ర అయ్యప్ప ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ వంగా మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజైన శుక్రవారం ఉదయం నిర్వహించిన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీరమాలక్ష్మీ అమ్మవార్ల ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమానికి రాకేశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌తో కలిసి పూజలు చేశారు. హంపీ విరూపాక్ష విద్యారణ్యభారతి సమక్షంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో రమణగురు స్వామి, బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామశరన్‌శర్మ గురూజీ, ఆలయ కమిటీ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి గడ్డం మంగారెడ్డి, డైరెక్టర్లు సద్ది సందీప్‌రెడ్డి, లంకల రమేశ్‌రెడ్డి, లింగాల దశరథ గౌడ్, విఘ్నేశ్వర్‌రెడ్డి, అంజయ్యగుప్తా, సుంకరి రమేశ్‌గౌడ్, నిర్మలేశ్‌గుప్తా, హరికృష్ణగుప్తా, సూర్యప్రకాశ్‌గుప్తా, మణిపాల్‌రెడ్డి, వంగా ప్రవీణ్‌రెడ్డి, మల్లికార్జున్‌గుప్తా, కేశవరెడ్డి, భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీ ఎన్నిక

మన్సూరాబాద్: రంగారెడ్డి జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి బి.శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యులు సమావేశమై ఎల్‌బీనగర్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అరుణ్, కార్యదర్శిగా స్టాలిన్, ఉపాధ్యక్షులుగా వేణు, జ్యోతిబాసు, సుమంత్, రమేష్, సహాయ కార్యదర్శులుగా శివ, నవీన్, శ్రీకాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి గుండె శివకుమార్ తెలిపారు.


ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మలక్‌పేట: యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జయంత్ తెలిపిన వివరాల ప్రకారం... మూసారంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలో నివాసం ఉంటున్న అగీర్ వెంకటరమణ వ్యాపారి. ఇతనికి ముగ్గురు కుమారులు. వీరిలో ఇద్దరు విదేశాల్లో ఉండగా.. చిన్న కొడుకు అగీర్ చాణక్య అలియాస్ షణ్ముఖ (22) టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీలో పాసయ్యాడు. తండ్రి పాటు వ్యాపారం చూసుకుంటూ డిప్లొమాలో చేరాడు. ఇలా ఉండగా, గురువారం రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చిన చాణక్య భోజనం చేస్తూ డిప్లొమాలో సబ్జెక్టులు క్లిష్టంగా ఉన్నాయని, అర్థం కావడం లేదని తల్లితో అన్నాడు. భోజనం చేశాక పడుకోవడానికి ఇంటి పైఅంతస్తులోని తన గదిలోకి వెళ్లాడు. ఉదయం పనిమనిషి అతడి గది తలుపు కొట్టగా స్పందించలేదు. తల్లి వచ్చి చూడగా కిటికీ ఊచలకు చాణక్య లుంగీతో ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రేమ వ్యవహారమే చాణక్య ఆత్మహత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

నాగోలు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... ఎల్‌బీనగర్, ఎల్‌పీటీ మార్కెట్ వద్ద టీ స్టాల్‌లో మద్యం విక్రయిస్తున్న బోయ చెన్నప్పను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద వివిధ బ్రాండ్లకు చెందిన 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. సాగర్ రింగ్ రోడ్డులో గొంది కృష్ణారెడ్డి అనుమానాస్పద స్థితిలో బ్యాగ్‌ను వేసుకుని తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి బ్యాగ్‌లో ఉన్న 41 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం వేధింపులకు గృహిణి బలి


శ్రావణి మృతదేహం

హస్తినాపురం: అదనపు కట్నం కోసం భర్త వేధిస్తుండటంతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం కానాయిగూడెం గ్రామానికి చెందిన జనగాం వెంకన్న తన కూతురు శ్రావణి(20)ని యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అంబల గ్రామానికి చెందిన తాళ్ల శ్రీశైలం (26)కి ఇచ్చి 2022 మే 25న పెళ్లి జరిపించారు. అనంతరం శ్రావణి, శ్రీశైలం దంపతులు వనస్థలిపురం ఠాణా పరిధిలోని సత్యసాయినగర్ కాలనీలో కాపురం పెట్టారు. శ్రీశైలం పెయింటర్‌గా పని చేస్తున్నాడు. వీరికి 10 నెలల బాబు ఉన్నాడు. కొంత కాలంగా శ్రీశైలం అదనపు కట్నం తేవాలని శ్రావణిని మానసిక, శారీరక వేధింపులకు గురి చేస్తున్నాడు. గతేడాది నవంబర్‌లో శ్రీశైలంకు వెంకన్న మోటార్ సైకిల్ కొనిచ్చాడు. నెల రోజులుగా అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని ఇటీవల శ్రావణి తండ్రికి చెప్పింది. వరి పంట కోసి డబ్బు ఇస్తానని తండ్రి ఆమెకు సర్ది చెప్పాడు. గురువారం తండ్రి శ్రావణికి ఫోన్ చేస్తే వంట చేస్తున్నా తర్వాత చేస్తానని చెప్పి పెట్టేసింది. ఇలా ఉండగా, శుక్రవారం శ్రావణి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త శ్రీశైలం మామకు ఫోన్ చేసి మీ కూతురు ఉరేసుకొని చనిపోయిందని చెప్పాడు. కట్నం వేధింపులతోనే తన కుమార్తె చనిపోయిందని, ఆమె మృతికి కారణమైన అల్లుడు శ్రీశైలంపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి వెంకన్న వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి శ్రావణి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియాకు తరలించారు.

మోదీ హయాంలో మహిళలకు పెద్దపీట


సహదేవ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న దశరథలక్ష్మి

చంచల్‌గూడ: మహిళలను రాజకీయంగా ప్రోత్సహిస్తూ, వారి సంక్షేమం కోసం వివిధ పథకాలు ప్రవేశ పెడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ముందుకు సాగుతున్నారని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి దశరథలక్ష్మి అన్నారు. ఆమె హైదరాబాద్ పార్లమెంట్ మహిళా మోర్చా కన్వీనర్‌గా నియమితులైన నేపథ్యంలో తనకు రాజకీయంగా వెన్నుదన్నుగా ఉన్న పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్‌ను శుక్రవారం కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత దశాబ్ద కాలంగా మోదీ హయాంలో మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తూ ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు.

వినియోగదారుల ఫోరం గ్రేటర్ అధ్యక్షుడిగా రమేశ్ గౌడ్

నాగోలు: తెలంగాణ వినియోగదారుల ఫోరం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా కొత్తపేటకు చెందిన ముప్పిడి రమేశ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ వినియోగదారుల ఫోరం కన్వీనర్ సింపాల్ రాథోడ్ ఉత్తర్వులు జారీ చేసి శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ, నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన వారికి అండగా వినియోగదారుల ఫోరం అండగా ఉంటుందని అన్నారు. తెలంగాణ వినియోగదారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అంబు రాథోడ్, రాష్ట్ర సలహాదారు కె. యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

జల సంరక్షణకు కృషి చేయాలి

సైదాబాద్: జల సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలని శ్రీసాయినగర్ అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు సుంచు పద్మిని కోరారు. శుక్రవారం ఐఎస్‌సదన్ డివిజన్ శ్రీసాయినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ జల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బస్తీ మహిళలు, చిన్నారులకు తాగునీటి ప్రాధాన్యం గురించి ఉపాధ్యాయురాలు వివరించారు. అవసరాలకు అనుగుణంగా తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని అన్నారు. మంచి నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా చేయవద్దని ఉపాధ్యాయురాలు చిన్నారులకు సూచించారు. కార్యక్రమంలో కేంద్రం సహాయకురాలు సక్కూ, బస్తీ మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

నేడు నీటి పొదుపుపై అవగాహన

నాగోలు: వరల్డ్ వాటర్ డే సందర్భంగా నాగోలు డివిజన్‌లోని రాక్‌టౌన్ కాలనీలో శనివారం నీటి పొదుపు, నీటి వాడకంలో జాగ్రత్తలు, ఇంకుడు గుంతల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమ ఏర్పాటు చేస్తున్నట్లు రాక్‌టౌన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వినోద్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కాలనీలోని గోటేటి ఫంక్షన్ హాల్ దగ్గర ఉదయం 8 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొనాలని ఆయన కోరారు.

చట్టబద్ధమైన బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

చాదర్‌ఘాట్: రాష్ట్రంలో చట్టబద్ధమైన బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు పాపని నాగరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో పదేళ్ల పాటు ఉన్న కమిషన్ అధ్యయనాల పేరిట దేశంలోని పలు ప్రాంతాల్లో పర్యటించడం తప్ప బీసీలకు ఎలాంటి మేలు చేయలేదని విమర్శించారు. గత కేసీఆర్ ప్రభుత్వ ఆదేశానుసారమే అప్పటి బీసీ కమిషన్ సహజ న్యాయసూత్రాలకు వ్యతిరేకంగా పలు సిఫార్సులు చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం అలాంటి కమిషన్‌ను రద్దు చేసి చట్టబద్ధత కూడిన బీసీ కమిషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఎస్‌కేవై స్పెషల్ స్కూల్‌కు ఆర్థిక సాయం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం కాలనీలో పి.శ్యామల దేవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌కేవై స్పెషల్ స్కూల్ (మానసిక బుద్ధి మాంద్యం గల విద్యార్థుల స్కూల్)కు రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి రూ.25 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, పెద్దపూర సైదులు, మాజీ సర్పంచ్ పాండు వంగాల శ్రీకాంత్ రెడ్డి, విజయ్, జహంగీర్ పాల్గొన్నారు.

నిరుపేద ఆర్యవైశ్యులు కాంగ్రెస్‌కు రుణపడి ఉంటారు


సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న లక్ష్మీనారాయణ, పక్కన మంత్రి కోమటిరెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి

మలక్‌పేట: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు నిరుపేద ఆర్యవైశ్యులు ఎల్లప్పుడు కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటారని ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నందుకు సీఎంను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, వారికి చేయూత అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో ఆర్య వైశ్యులకు సముచిత స్థానం కల్పించాలని సీఎంను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఉన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నాగోలు: డివిజన్ పరిధిలోని జైపురి కాలనీలో కొలువైన శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ కొలను వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినాథుడిని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి కొరివి జంగయ్య గుప్తా, కోశాధికారి రావుల రంజిత్ గౌడ్, వ్యవస్థాపక అధ్యక్షుడు గుణగంటి రాములు గౌడ్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్ ప్రమాదకరం

నాగోలు: మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ అన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 100 మందికి వారి కుటుంబసభ్యుల సమక్షంలో శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని టీటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదం జరిగితే మనపై ఆధారపడిన కుటుంబ సభ్యుల పరిస్థితి ఏంటని ఒక్కసారి అందరూ ఆలోచించాలని కోరారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదన్నారు. సీటు బెల్ట్, హెల్మెట్ ధరించడం తదితర నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖుల సందేశాలను, సందేశాత్మక గీతాలను, రోడ్డు ప్రమాదాల దృశ్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటీలు అమరేందర్ రెడ్డి, అల్లూరయ్య, సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయండి


ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రజనీరావు

నాగోలు: బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ బ్రాహ్మణ జేఏసీ పొలిటికల్ ఇన్‌చార్జి నారపరాజు రజనీరావు ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రజనీరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని కులాలకు ఏర్పాటు చేసిన విధంగా బ్రాహ్మణులకు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి కోరారు. పలువురు బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సందడిగా గౌతమ్ మోడల్ స్కూల్ వార్షికోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే, స్కూల్ వార్షికోత్సవం కార్యక్రమాలు సందడిగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చైతన్యపురి సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ వహించి మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సూచించారు. పాఠశాల డీన్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నరసింహ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రైమరీ ఇన్‌చార్జ్ రోహిణి, ప్రీ ప్రైమరీ స్వప్న పాల్గొన్నారు.